RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 229 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 22 ఫిబ్రవరి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# ఛలో ఢిల్లీ పునః ప్రారంభం

# ఢిల్లీ బార్డర్‌లో ఉద్రిక్తత





దిల్లీ: పంటకు కనీస మద్దతు ధర అంశంలో కేంద్రం ప్రతిపాదనను తిరస్కరించిన రైతులు.. 'దిల్లీ చలో' పేరిట తమ నిరసనను నేడు తిరిగి ప్రారంభించనున్నారు. ప్రస్తుతం పంజాబ్, హరియాణా మధ్య ఉన్న శంభు సరిహద్దు వద్ద వారు దిల్లీ దిశగా కదలనున్నారు. దాంతో దేశ రాజధానిలో పోలీసులు అప్రమత్తమయ్యారు. దిల్లీ వైపు వెళ్లేందుకు శంభు వద్ద 14వేల మంది రైతులు, 1200 ట్రాక్టర్లు, 300 కార్లు, 10 మినీ బస్సులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అలాగే బారికేడ్లను ధ్వంసం చేసే పరికరాలను వారు తమ వెంట తీసుకెళ్తున్నారు. వాటిని స్వాధీనం చేసుకోవాలని హరియాణా పోలీసులు.. పంజాబ్ బలగాలను అభ్యర్థించారు. మరోపక్క దిల్లీలోకి ప్రవేశించే మార్గాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇదిలా ఉంటే.. కనీస మద్దతు ధరపై చట్టం తీసుకువచ్చేందుకు కేంద్రం ఒకరోజు పార్లమెంట్‌ను సమావేశపర్చాలని రైతు నాయకుడు శర్వాన్ సింగ్ పంధేర్ కోరారు. తమ మార్చ్‌ను అడ్డుకునేందుకు హరియాణాలోని సరిహద్దు గ్రామాల్లో పారామిలిటరీ బలగాలను మోహరించారని ఆరోపించారు. 'మేం చేసిన నేరం ఏమిటి..? మిమ్మల్ని ప్రధానిని చేశాం. మమ్మల్ని అణచివేసేందుకు ఈ విధంగా బలగాలను ఉపయోగిస్తారని అనుకోలేదు. మేము అసలు డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గేలా కేంద్రం ప్రతిపాదనలు చేసింది. ఇప్పుడు ఏం జరిగినా దానికి కేంద్రమే బాధ్యత వహించాల్సి ఉంటుంది' అని పంధేర్ హెచ్చరించారు. ఈ పరిణామాలపై కేంద్ర హోం శాఖ పంజాబ్ ప్రభుత్వానికి లేఖ రాసింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేసింది. ఆందోళనకారుల్లో కొందరు శంభు వద్దకు బుల్డోజర్లు, ఎర్త్ మూవర్స్ వంటివి తీసుకువచ్చారని వెల్లడించింది. భారీ మెషినరీని, ట్రాక్టర్లను ఆపరేట్ చేసే వ్యక్తులకు టియర్ గ్యాస్ ,రబ్బర్ బుల్లెట్ల నుంచి నుంచి రక్షణ కల్పించేలా క్యాబిన్లకు ఐరన్ షీట్లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.





# లోక్‌సభ ఎన్నికల వేళ.. బీఆర్ఎస్ నీటి పోరు యాత్ర




హైదరాబాద్: బీఆర్ఎస్ మళ్లీ పోరు బాట పట్టనుంది. తర్వలో నీటి పోరు యాత్ర చేసేందుకు పార్టీ యోచిస్తోంది. దక్షిణ తెలంగాణలోని నాగార్జున సాగర్, ఉత్తర తెలంగాణలోని కాళేశ్వరం నుంచి నీటి పోరు యాత్ర ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. యాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీఆర్ఎస్ పెద్దలు ప్లాన్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల వేళ ప్రతిపక్ష బీఆర్ఎస్ పూర్తిస్థాయి లో యాక్టివ్ అవుతోంది. ఇటీవలే కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించడంపై నల్గొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించిన విషయం తెలిసిందే.

ఈ సభ సక్సెస్‌తో జోష్‌లో ఉన్న బీఆర్ఎస్ ఇదే ఊపులో నీటి పోరుయాత్ర చే సి తమ పాలనకు, కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కారు పార్టీ డిసైడైనట్లు కనిపిస్తోంది. తెలంగాణ కోసం కొట్లాడేది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఎన్నికల వేళ మరోసారి ప్రజలకు గుర్తుచేసేందుకే ఈ యాత్ర అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పొత్తు ఉంటుం దని ఊహాగానాల నేపథ్యంలో ఇరు పార్టీల సీనియర్ నేతలు దానిని ఖండిస్తున్నారు. కానీ ఎన్నికల వేళ కేసీఆర్ ఢిల్లీ పర్యటనపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. పొత్తుపై బీజేపీ పెద్దలతో మాట్లాడేందుకే కేసీఆర్ ఢిల్లీ వెళుతున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది.

# ఇందిరాగాంధీ నిర్ణయంతోనే ఫార్మా రంగంలో మెరుగైన స్థితిలో హైదరాబాద్ : సీఎం రేవంత్




హైదరాబాద్: ఆర్థిక ప్రగతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉ ందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులకు రక్షణ కల్పించడమే కాకుండా.. లాభదాయకంగా ఉండేలా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. హైద రాబాద్‌లో 'సీఐఐ తెలంగాణ' ఆ ధ్వర్యంలో నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడారు. ఇందిరాగాంధీ విధానపరమైన నిర్ణయం తీసుకుని ఐడీపీఎల్‌ను ప్రారంభించినందునే ఫార్మా రం గంలో హైదరాబాద్ మెరుగైన స్థితి లో ఉందన్నారు. పాలకుల నిర్ణ యాలు, విధానాలు రాష్ట్ర ఆర్థిక పురోగతికి తోడ్పడతాయని చెప్పా రు. అవుటర్ రింగు రోడ్డు (ఓఆర్ ఆర్) గురించి గతంలో మాట్లాడితే అవన్నీ అవసరమా అన్నారని.. ఇప్పుడు అదే హైదరాబాద్, తెలం గాణకు లైఫ్‌లైన్‌గా మారిందన్నారు.

# అట్టహాసంగా ఆరంభమైన 'తెలంగాణ కుంభమేళా'




మేడారం కిక్కిరిసింది.. జనసంద్రంగా మారిపోయింది. దారులన్నీ అటువైపే అన్నట్టుగా అక్కడి పరిస్థితులు తలపిస్తున్నాయి. నేడు మహాజాతర ప్రారంభం సందర్భంగా సమ్మక్క-సారలమ్మల భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆలయం ప్రాంగణాలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులు పెద్ద సంఖ్యలో జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. కాగా మేడారం మహాజాతరకు సర్వం సన్నద్ధమైంది. నేడు (బుధవారం) సారలమ్మర రాకతో నాలుగు రోజుల జాతర షురూ అయ్యింది. ఈ మేరకు ఈ రోజు తెల్లవారుజాము నుంచే తల్లి కొలువైన కన్నెపల్లిలో కార్యక్రమాలు మొదలయ్యాయి. పొద్దున్నే సారలమ్మ ఆలయాన్ని శుద్ధి చేసి అలికి ముగ్గులతో అలంకరించారు. ప్రధాన పూజారి అయిన కాక సారయ్య పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇక ఈ రోజు సాయంత్రం ఆదివాసీ పూజారులు రహస్య పూజలు చేస్తారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. తర్వాత సారలమ్మను (సారయ్య



రూపంలో) ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు తీసుకొస్తారు. ఇక ఈ రోజు రాత్రి పగిడిద్దరాజు, గోవిందరాజులను కూడా గద్దెలపైకి తీసుకొస్తారు. మహాజాతర మొదలవనున్న వేళ మేడారం ఇప్పటికే జనసంద్రంగా మారిపోయింది. దారులన్నీ అటువైపే అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది.





## మేడారంలో ఎక్కడ చూసినా జనసంద్రం.. దారులన్నీ అటువైపు

**సారలమ్మను మొక్కితే..** సమ్మక్క గారాల బిడ్డ అయిన సారలమ్మ ధైర్యానికి, వీరత్వానికి, త్యాగానికి ప్రతీక. 12వ శతాబ్దాంలో తమ గిరిజన ప్రాంతాన్ని కాపాడుకునేందుకు కాకతీయలతో సారలమ్మ యుద్ధం సాగించిన తీరును, వీరమరణం ద్వారా ఆమె త్యాగాన్ని భక్తులు స్మరించుకుంటూ దైవంగా కొలుస్తారు. తల్లిని మొక్కితే సంతానం ప్రాప్తిస్తుందని, రుగ్మతలు పోతాయని భక్తుల విశ్వాసం. ఫలితంగా మేడారానికి సాగుతున్న సమయంలో సారలమ్మకు కన్నెపల్లిలో భక్తులు ఎదురెళ్లి మంగళహారతులు ఇస్తారు. సంతానం కలగాలని, సమస్యలు తీరాలని తడి బట్టలతో భక్తులు వరం పడతారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## మోడీకి సెల్ఫ్ డబ్బా ఎక్కువ అయ్యిందా?

గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ ఆ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలిపారనే పేరు తెచ్చుకున్నారు.. నరేంద్ర మోదీ. అవే పేరు ప్రతిష్టలతో 2014లో బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థి కూడా అయిపోయారు. అంతేకాకుండా 2014, 2019 ఎన్నికల్లో బీజేపీని ఒంటి చేత్తో అధికారంలోకి తీసుకొచ్చి వేరే పార్టీ అవసరం లేకుండా కేంద్రంలో సొంతంగా బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. గత పదేళ్లగా ప్రధానిగా ఉంటున్న నరేంద్ర మోదీ మరో విజయంపై దృష్టి సారించారు. వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీని అధికారంలోకి తెచ్చి ముచ్చటగా మూడో సారి ప్రధానమంత్రి కావాలని ముచ్చట పడుతున్నారు. సర్వేలు కూడా తమకే అనుకూలంగా ఉన్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సొంత డబ్బా కొట్టుకుంటున్నారని సెటైర్లు పడుతున్నాయి. తాజాగా బీజేపీ జాతీయ మండలి సమావేశాల్లో భాగంగా మాట్లాడిన మోదీ తనను కీర్తించుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీ గెలవడం ఖాయమని.. ఈ నేపథ్యంలోనే విదేశాలు ఎన్నికల్లో గెలిచాక తనను ఆ దేశాలకు రావాలని ఆహ్వానిస్తున్నాయని మోదీ చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎన్నో దేశాలు తనను వారి దేశాలకు రావాలని ఆహ్వానించాయని మోదీ వెల్లడించారు. మరోసారి దేశంలో బీజేపీ సర్కారు రాబోతుందని ప్రపంచ దేశాలన్నీ నమ్ముతున్నాయనడానికి ఇదే నిదర్శనమన్నారు. అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా 11 రోజులు తాను ఉపవాసం ఉన్నానన్నారు. ఈ సమయంలో తాను నాసిక్, లేపాక్షి, శ్రీరంగం, రామేశ్వరం, ధనుష్కోటి లాంటి ప్రాంతాలకు సాధారణ భక్తుడిలా వెళ్లానని ప్రధాని చెప్పుకొచ్చారు. ఆ సమయంలో దక్షిణ భారత ప్రజలు కనబరిచిన ఆదరణను మాటల్లో చెప్పలేనన్నారు. రాజకీయ పండితుల కొలమానాలకు అది అందదని తెలిపారు. ఈ పదేళ్లలో జమ్ముకశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 ఆర్టికల్ ను రద్దు చేశానని మోదీ గుర్తు చేశారు. అలాగే ట్రిపుల్ తలాక్ ను రద్దు చేశామన్నారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని గుర్తు చేశారు. అయోధ్యలో రామమందిరం నిర్మించామన్నారు. కర్తార్ పూర్ నడవా తెరిచామని చెప్పారు. పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామన్నారు. ఇలా బీజేపీ జాతీయ మండలి సమావేశాల్లో మోదీ తనను పొగుడుకోవడానికి, స్తోత్రాలకే పరిమితమయ్యారని అంటున్నారు. దీంతో మోదీ సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటున్నారని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి.

## సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గాన్ని అనుసరించాలి

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్







**నిర్మల్ ఫిబ్రవరి 21(ప్రభాత సమాచారం)** శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా సంత్ సేవాలాల్ మహారాజ్, జగదాంబ,రామారావు మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లంబాడాల అభివృద్ధి అన్ని విధాలుగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి యేటా సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహిస్తుందన్నారు. లంబాడాలు ఎ సమాజంలో లేని విధంగా వరకట్నం అధికంగా తీసుకుంటున్నారని అన్నారు. ఈ వరకట్నంను తీసుకోవద్దని అన్నారు. వరకట్నం ద్వారా పెదలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతారని తెలిపారు. రాష్ట్రంలో లంబాడాలు ఎదురుకుంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు చెపడతామన్నారు. అనంతరం సేవాలాల్ జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

## పల్లె చెరువుకు ఎసరు!



మహబూబ్‌నగర్ :మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలో హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ చెరువు కనమరుగయ్యే పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితిని కల్పిస్తున్నది కూడా ప్రభుత్వ శాఖల అధికారులే. ఎన్ని ఫిర్యాదులు అందినా కనీసం ఆ చెరువు పరిరక్షణ వైపు కన్నెత్తి చూడటం లేదు. 14 ఎకరాల శిఖం ఉన్న ఈ చెరువు ప్రాంతంలో ఎకరా రూ. 3 కోట్లు విలువ చేస్తుంది. ఈ చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా అధికారులు చోద్యం చూస్తుండటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. స్థిరాస్తి వ్యాపారుల కనుసన్నల్లోనే ఆక్రమణలు జరుగుతున్నాయన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి పరిధిలో పల్లె చెరువు సర్వే నంబరు 581లో 14.09 ఎకరాల శిఖం ఉంది. ఈ చెరువు పరిధిలో పలు సర్వే నంబర్లలో ప్రైవేటు పట్టా భూములున్నాయి. కొందరు స్థిరాస్తి వ్యాపారులు దీనిపై కన్నేశారు. ఉమ్మడి జిల్లాలో గతంలో కీలక ప్రజాప్రతినిధులుగా వ్యవహరించిన వారి సహకారంతోనే అప్పట్లో కబ్జాకు బీజం పడింది. చెరువు నీటిని బయటకు పంపి మరీ ఆక్రమణలకు తెగబడుతున్నారు. చెరువు నిండి అలుగు పారితే వరదనీరు పోవడానికి ప్రత్యేకంగా కాలువలను ఏర్పాటు చేశారు. ఈ చెరువు దగ్గరలో రైల్వే ట్రాక్ ఉండటంతో అప్పట్లో అధికారులు ఇలా కాలువలు నిర్మించారు. ప్రస్తుతం ఈ అలుగును ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. అలుగు వెంట రోడ్డు వేశారు. వర్షపు నీరు వచ్చే ప్రాంతాన్ని మొరం వేసి చదును చేశారు. చెరువు శిఖంను ధ్వంసం చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో వెంచర్లు వేసి ప్లాటు వేశారు. మూడు సర్వే నంబర్లలో మొత్తం 35 వరకు ప్లాట్లు వేశారు. వీటిపై అన్ని శాఖల అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా ఎవరూ నోరు విప్పడం లేదు.

అధికారులకు తెలిసే జరుగుతుందా?: చెరువు కబ్జాకు గురవుతున్నా సంబంధిత శాఖలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఆ అక్రమణల్లో కొందరు అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ చోద్యం చూస్తున్నారే తప్ప ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంలేదు. దీని వెనుక పెద్ద ఎత్తున లావాదేవీలు జరిగాయని పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తాము అన్ని శాఖల అధికారులకు వినతిపత్రం ఇచ్చామని, ఎందుకు అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదని నేరుగా ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ చెరువు విలువ సుమారు రూ. 40కోట్ల వరకు ఉంటుంది. ఆక్రమణలతో దీన్ని పూర్తిగా కనుమరుగు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో రెండు స్థిరాస్తి సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆ సంస్థలు పెద్ద ఎత్తున ముడుపులు చెల్లిస్తుండటంతోనే కొందరు అధికారులు మౌనంగా ఉంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో యథేచ్ఛగా ప్రహరీలు నిర్మించడం, మట్టితో చదును చేయడం, ప్లాట్లు విక్రయాలతో ప్రతి రోజు రూ. లక్షల్లో ఇక్కడ లావాదేవీలు జరుగుతున్నాయి.

చెరువు పరిరక్షణపై పోరాటం..: ముదిరెడ్డిపల్లి గ్రామస్థులు కొన్నేళ్లుగా ఈ చెరువు ఆక్రమణలపై పోరాటం చేస్తున్నారు. గతంలో ఇక్కడ ఉన్న పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలు కాలుష్య రసాయనాలను ఈ చెరువులోనే వదిలేవారు. చేపలు కాలుష్యం బారినపడి చనిపోయేవి. స్థానికంగా పంటలపైన ప్రభావం పడింది. దీనిపై స్థానికులు హరిత ట్రైబ్యునల్ వరకు వెళ్లి పోరాటం చేశారు. ఇప్పుడిప్పుడే ఈ చెరువులోకి రసాయనాలు వదలడం మానేశారు. గ్రామస్తులు చెరువుకు మళ్లీ పూర్వ వైభవం వస్తుందని ఆశపడుతున్న తరుణంలో స్థిరాస్తి వ్యాపారులు దీనిపై కన్నేయడంతో అసలు చెరువు ఉంటుందా? అన్న ఆందోళనలో గ్రామస్థుల్లో నెలకొంది. ముదిరెడ్డిపల్లిలోని పల్లె చెరువులో ఆక్రమణలు తన దృష్టికి రాలేదు. మా సిబ్బంది దృష్టికి వచ్చి ఉండొచ్చు. వెంటనే వివరాలు తెలుసుకుంటాను. కిందిస్థాయి అధికారులను చెరువు వద్దకు వెళ్లి విచారణ జరిపిస్తాం. శ్రీనివాస్, ఎస్ఈ, నీటిపారుదలశాఖ

## పురాలకు నిధులు.. ప్రగతి ఆశలు

చెన్నూరు : పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం ఇన్నాళ్లు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ముఖ్యమంత్రి హామీ నిధులతో పాటు పట్టణ ప్రగతికింద మ్యాచింగ్ గ్రాంటు, 15వ ఆర్థిక సంఘం నిధులు నెలనెలా మంజూరు చేస్తుండట ంతో పట్టణ ప్రగతి పరుగులు పెట్టింది. ఎనిమిది నెలలుగా నిధులు కేటాయిం చకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో పురపాలికలకు ప్రాధాన్యమిస్తూ గతేడాది కన్నా రూ. 320 కోట్లు అదనంగా నిధులు కేటాయించడంతో పాలకవర్గాల్లో ఆశలు చిగురించాయి. పట్టణాల్లో కనీస మౌలిక వసతులు కల్పించి సుందరంగా తీర్చిదిద్దేందుకు అవకాశం లభించనుంది.

పెరిగిన అవసరాలు.. తగ్గిన ఆదాయం ఉమ్మడి జిల్లాలో 12 పురపాలక సంఘాలు ఉన్నాయి. ఆస్తిపన్ను, నల్లా బిల్లుల, ట్రేడ్ లైసెన్స్‌లు, ప్రచారబోర్డుల ఫీజులు, ఇతర అద్దెల ద్వారా సొంత ఆదాయం సమకూరుతుంది.

సమయానికి వసూలు కాకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు సమకూర్చుకోవాలనే ఆలోచనను పాలకవర్గాలు చేయడం లేదు. దీంతో విద్యుత్తు బిల్లులు, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, ఒప్పంద కార్మికులు, ఉద్యోగుల వేతనాలు, అత్యవసర ఖర్చులు, సాధారణ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపుల వంటివి తడిసి మోపడవుతున్నాయి. అవసరాలు పెరిగిపోవడం, ఆదాయం తగ్గిపోవడంతో అధికారులు ఆందోళనకు గురవుతు న్నారు. ఎనిమిది నెలలుగా నిలిచిన నిధులు మున్సిపాలిటీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంటు నిధులు ఎనిమిది నెలలుగా నిలిచిపోయాయి. ఆర్థిక సంఘం నిధులైతే ఏడాది నుంచి కొన్ని పురపాలికలకు రావడం లేదు. ఈ నిధులు నెలవారీగా ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతం ఆగిపోవడంతో సమస్యలకు కారణంగా మారుతోంది. ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ. 30 కోట్లు, రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంటు నిధులు రూ. 15.80 కోట్లు మొత్తంగా రూ. 45.80 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తక్షణమే మంజూరు చేస్తే ఎప్పటిలాగే ఉమ్మడి జిల్లాలో పట్టణ ప్రగతి జోరు పెరగనుంది. అభివృద్ధి పనులపై ప్రభావం పట్టణ ప్రగతి కింద సమీకృత మార్కెట్లు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, హరితహారం, పార్కులు, శ్మశానవాటికలు, వాకింగ్‌ట్రాక్‌లు, ఓపెన్‌జిమ్ లు, ప్రజా మరుగుదొడ్లు ప్రారంభించారు. అధికశాతం పూర్తికాగా సమీకృత మార్కెట్లు, పార్కుల పనులు తుది దశలో ఉన్నాయి. వీటికి బిల్లులు మధ్యలో ఆపేశారు.

## నీరు లేక.. చి'వరి'కి కన్నీరు

తూప్రాన్: రామాయంపేట అన్నదాతకు అడుగడుగునా నష్టాలే ఎదురవుతున్నాయి. వేసవి సమీపించక ముందే భూగర్భ జలాలు అడగండి పంటలు ఎండిపోతున్నాయి. సమీప చెరువుల్లోకి నీరు చేరితే పంటలు కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. నిజాంపేట మండల పరిధి కే వెంకటాపూర్ పరిధిలో సుమారు వంద ఎకరాల్లో పంట ఎండుముఖం పడుతోంది. మరో పది రోజుల్లో పొలాలకు నీరందకపోతే పూర్తిగా ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండపోచమ్మ దిక్కు: పంటను కాపాడుకోవడానికి కొండపోచమ్మ కాలువ ఒక్కటే దిక్కు. ఈ కాలువ చేగుంట మండలం పులిమామిడి గ్రామ సమీపం వరకు ఉంది దీని ద్వారా పులిమామిడి చెరువులోకి నీరు చేరి అక్కడి నుంచి వెంకటాపూర్ పరిధి కాండ్ల చెరువులోకి చేరితే పంట పొలాలకు నీరందే అవకాశం ఉంది. మరోవైపు భూగర్భ



జలాలు పెరిగి సమీపంలోని బోర్లు సైతం అడుగంటి పోకుండా ఉంటాయి. కొండపోచమ్మ కాలువ నీటి విడుదలతో రామాయంపేట మండల పరిధి ధర్మారం, నిజాంపేట మండల పరిధి నార్లాపూర్ చెరువుల్లోకి నీరు చేరేందుకు అవకాశం ఉంది. తద్వారా వేలాది ఎకరాల్లో రైతులకు మేలు జరగనుంది.

కాలువ పూర్తికాక: కే వెంకటాపూర్ చెరువులోకి నీరు చేరేందుకు మల్లన్న సాగర్ కాలువను అనుసంధానం చేస్తున్నారు. అయితే కాలువ పూర్తికాకపోవడంతో చెరువులోకి నీరు చేరేందుకు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో కొండపోచమ్మ కాలువ ప్రస్తుతం రైతులకు దిక్కయింది. చెరువులోకి నీరు చేరితే సుమారు 250 ఎకరాల్లో సాగయ్యే పంటలకు మేలు జరగనుంది.

అప్పుల ఊబిలో..: కె వెంకటాపూర్ పరిధిలో రైతులు తమ పంటను కాపాడుకోవడానికి బోర్లు వేస్తున్నారు. ఒక్కొక్కరు రెండు బోర్లు సుమారు 500 అడుగుల వరకు వేసినా చుక్క నీరు రావడంలేదని కన్నీరు కారుస్తున్నారు. ఈ వారం రోజుల వ్యవధిలోనే సుమారు 15 బోర్ల వరకు వేసి నీరు రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ఒక్కో బోరుకు రూ. 70 నుంచి రూ. లక్ష వరకు వెచ్చించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకుంటే తమ పరిస్థితి వలస పోవడమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


## భత్యం తక్కువ.. సేవలు ఎక్కువ

ఆత్మకూరు : గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల జీతాలు తక్కువ, సేవలు ఎక్కువ కావడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఇచ్చే తక్కువ వేతనాన్ని సైతం పెండింగ్‌లో పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీటికి తోడు ప్రత్యేక కార్యక్రమాల పేరుతో ఒత్తిళ్లకు గురి చేస్తుండటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాస్తవానికి ప్రతి 500 జనాభాకు ఒక పారిశుద్ధ్య కార్మికుడిని నియమించాలి. ప్రస్తుతం దీనికి అనుగుణంగా సిబ్బంది లేరు. ప్రస్తుతం ఉన్న జనాభా ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లాకు 1,811, వనపర్తికి 1155, నారాయణపేటలో 1,124, జోగులాంబ గద్వాలలో 1,219 నాగర్‌కర్నూల్‌లో 1,723 మంది పారిశుద్ధ్య సిబ్బంది సేవలు అవసరం .ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,032 మంది అవసరం కాగా, ఇపుడు 5,033 మంది ఉన్నారు. జనాభా ప్రకారం ఇంకా రెండువేలమంది అవసరం.

కొరతను తీర్చకుండా..

సిబ్బంది కొరతను తీర్చకుండా ఉన్న సిబ్బందికే సేవల్ని విస్తరించడం, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతుండటం వల్ల ఒత్తిడికి గురవుతున్నారు. గతంలో పారిశుద్ధ్య సిబ్బంది కేవలం మురుగుకాల్వల్లోని చెత్తను తొలగించడం, వీధుల్ని శుభ్రం చేయడం వంటి పనులే చేసేవారు. ఇపుడలా కాకుండా పాఠశాలల పరిసరాల పరిశుభ్రత, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ పనులు చేయాల్సి వస్తోంది. వీటికి అదనంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు అపుడపుడు చేపడుతున్నారు. పంచాయతీల్లో మొదలైన ప్రత్యేకాధికారుల పాలన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్ని చేపట్టింది. సిబ్బంది కొరత, పెరిగిన సేవల మూలంగా ఈ కార్యక్రమం ఏ మేరకు సఫలీకృతం అవుతుందనేది చూడాలి.



అంతేకాదు గ్రామాల్లో ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా పారిశుద్ధ్య పనులకు వీరినే వినియోగిస్తున్నారు. ఎక్కడ అపరిశుభ్రత తాండవించినా వీరినే విమర్శిస్తున్నారు.

పెండింగ్‌లో వేతనాలు

ప్రస్తుతం పంచాయతీ సిబ్బందికి వేతనంగా రూ. 9,500 అందజేస్తున్నారు. ఈ ఇచ్చే కొద్దిపాటి వేతనాన్ని సైతం నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. ప్రస్తుతం మూడు నెలలకు సంబంధించిన వేతనం పెండింగ్‌లో ఉంది. పంచాయతీల నుంచి చెక్కుల పంపిస్తున్నా జిల్లా కేంద్రంలోని కోశాగారంలో క్లియరెన్స్ కావడంలేదు. ఒక్కొక్క చెక్కు క్లియరెన్స్‌కు కనీసం వంద రోజుల సమయం తీసుకుంటోంది.. ఈ విషయమై గ్రామాల్లోని అధికారులతో ప్రస్తావిస్తే జిల్లా కేంద్రాల్లో జాప్యం జరిగితే తామేమి చేయగలమని అంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుభూతితో స్పందించాల్సిన అవసరం ఉంది.

## రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా అజ్మతుల్లా హుస్సేని నియామకం పట్ల హర్షం

**ఆయన నియామకం గంభీరావుపేట మండలానికి గర్వకారణం**
**డా. కూడేల్లి ప్రవీణ్ కుమార్**



**గంభీరావుపేట ఫిబ్రవరి 21(ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన అజ్మతుల్లా హుస్సేని బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షనీయమని డా. ప్రవీణ్ కుమార్ కూడేలి పేర్కొన్నారు. బుధవారం హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలానికి చెందిన ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ చెందిన వ్యక్తి రాష్ట్రస్థాయి లో ఉన్నతమైన పదవిని అధిరోహించడం మండలానికి గర్వకారణం అని కొనియాడారు. ఈ నియామకానికి తోడ్పడిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ రాబోయే రోజుల్లో స్నేహశీలి ,మృదుసభవి, మితభాషి, సౌమ్యులు అయినటువంటి సయ్యద్ అజ్మతుల్లా హుస్సే అల్లా దయవలన అనేక ఉన్నతమైన పదవులను అధిరోహించాలని కోరారు.

## హమ్మయ్య.. అడుగేశారు..!

నిర్మల్ : పట్టణంలో రహదారికి ఇరువైపులా ఆక్రమణలు పెరుగుతున్నాయి. ఒకరిని చూసి ఒకరు తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటుచేస్తూ, వాటిని శాశ్వతంగా మారుస్తున్నారంటూ స్థానికుల నుంచి ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. చూస్తాం, చేస్తాం అంటూ ఇన్నాళ్లు కాలయాపన చేసిన అధికారులు.. ఇప్పుడు ఊహించనిరీతిలో అడుగేశారు. ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఈ నడక ఇలాగే కొనసాగాలని, అక్రమ నిర్మాణాలన్నింటినీ తొలగించి పట్టణవాసుల ఇక్కట్లను శాశ్వతంగా దూరం చేయాలని స్థానికులు కోరుతున్నారు. పాత గాంధీపార్కు వద్ద..ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు ప్రారంభించడం స్థానికుల్లో హర్షాతిరేకాలను కల్గిస్తోంది. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఉన్న పాత గాంధీపార్కు (ప్రస్తుతం గాంధీ కూరగాయల మార్కెట్) వద్ద ఇరువైపులా ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. కొందరు దుకాణాలు ఏర్పాటుచేసి వ్యాపారం కొనసాగిస్తున్నారు. వీటిని తొలగించాలని గతంలో సూచించినా రాజకీయ ఒత్తిళ్లతో ఆచరణకు నోచుకోలేదు. ఈ మధ్యకాలంలో మరికొన్ని కొత్త దుకాణాలు ఏర్పడటం మొదలైంది. విషయం గమనించిన పుర అధికారులు సంబంధిత దుకాణదారుల ందరికీ హెచ్చరికలు జారీచేశారు. సాయంత్రం సమయంలో రహదారికి ఓ పక్కనున్న దుకాణాలన్నింటినీ తొలగించారు. అన్నివైపులా ఇదేరీతిలో దుకాణాలను తొలగిస్తే అందరికీ ప్రయోజనంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

కొనసాగేనా..ఆక్రమించుకొని ఏర్పాటుచేసిన దుకాణాలు, ఇతర నిర్మాణాలను అధికారులు తొలగించడం స్వాగతించాల్సిన విషయం. ఇది కొద్దిమందికి ఇబ్బందికరం కావొచ్చు. కానీ, పెద్దసంఖ్యలో ప్రజానీకానికి దీనివల్ల ఎంతో మేలు కలగనుంది. వాహనాల రాకపోకలకు ఆటంకం తగ్గుతుంది. రద్దీ కాస్త నియంత్రణలోకి వస్తుంది. అయితే.. అధికారులు చేపట్టిన ప్రయత్నం పూర్తిస్థాయిలో కొనసాగుతుందా లేక మొక్కుబడి తంతుగా మారుతుందా అనే అనుమానాలు తొలచివేస్తున్నాయి. ప్రధానంగా బస్టాండ్, ఈద్‌గాం, శివాజీచౌక్, పాతబస్టాండ్, డాక్టర్స్‌లేన్, బైల్‌బజార్.. తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటుచేసిన నిర్మాణాలను పూర్తిస్థాయిలో తొలగించి, ముమ్ముందు ఎవరూ ఆక్రమించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఆక్రమించుకొని..ప్రభుత్వ స్థలంలో మెల్లిగా తాత్కాలిక దుకాణం ఏర్పాటుచేయడం, కొద్దిరోజుల తర్వాత శాశ్వత దుకాణం సిద్ధం చేయడం.. కొంతకాలంగా నిర్మల్ పట్టణంలో ఇబ్బడిముబ్బడిగా సాగుతోంది. ఇలా దుకాణం సిద్ధమయ్యాక దాన్ని నిర్వహించడం లేదా ఇతరులకు అద్దెకు ఇవ్వడం చేస్తున్నారు. మామూలుగానైతే ఎక్కడైనా చిన్న వ్యాపారం ప్రారంభించాలంటే అడ్వాన్సు చెల్లించాలి. క్రమం తప్పకుండా అద్దె పెంచుతూ ఉండాలి. కానీ, ఇక్కడ మాత్రం అదేమీ అవసరం లేదు. ఉచిత స్థలం. ఎలాంటి అడ్వాన్సుల్లేవు. కొద్దిపాటి పెట్టుబడి పెడితే క్రమం తప్పకుండా ఆదాయం. ఇంతకన్నా ఏం కావాలి. అందుకే, ఒకరిని చూసి మరొకరు దందాకు తెరతీశారు. పట్టణంలోని ప్రధాన రహదారులైన బైల్‌బజార్ నుంచి శివాజీచౌక్, సోఫినగర్ వరకు, మంజులాపూర్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతం వరకు ఎక్కడచూసినా ఇలా ఆక్రమించుకొని ఏర్పాటుచేసిన దుకాణాలు, కొనసాగిస్తున్న వ్యాపారాలు కోకొల్లలుగా కనిపిస్తుంటాయి. రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు సైతం ఈ తరహా అక్రమార్జనకు పాల్పడుతుండటంతో అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారనే వాదనలూ లేకపోలేదు.

దశలవారీగా తొలగిస్తాం:సి.వి.ఎన్.రాజు, మున్సిపల్ కమిషనర్
నిర్మల్ పట్టణంలో చాలాచోట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమించుకొని అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో ఫిర్యాదులున్నాయి. అన్నిచోట్లా ఆక్రమణలను తప్పకుండా తొలగిస్తాం. దశలవారీగా ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

# మంత్రి సీతక్కపై తప్పుడు ప్రచారం చేస్తే సహించం..!!

**బిఆర్ఎస్ కరపత్రం 'నమస్తే తెలంగాణ'ను పాతాళంలో తొక్కేస్తాం**
**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హెచ్చరిక**



**ఉట్నూర్ ఫిబ్రవరి 21(ప్రభాత సమాచారం )**
పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ప్రజలలో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ కుట్రతో చేసిన ఆరోపణలను ఉపసంహరించకపోతే తీవ్ర పరిణామాలు ఎదురుకోవాల్సి వస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హేచ్చరించారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు సీతక్కపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేస్తున్న మంత్రి సీతక్కను రాజకీయంగా తొక్కాలనే ప్రయత్నం చేస్తే సహించేది లేదన్నారు. గతంలో కేటీఆర్ దొర ఇసుక దందాలను ప్రోత్సహిస్తే... ఆ ఇసుక మాఫియా దందాను బ్యాన్ చేసిన మంత్రి సీతక్కపై కక్షతో ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ ఆరోపణలకు సూత్రదారి అయిన బిఆర్ఎస్ పార్టీ కరపత్రమైన నమస్తే తెలంగాణ పేపర్ ను పాళంలో తొక్కేస్తామన్నారు. మంత్రి సీతక్కపై తప్పుడు ప్రచారాన్ని మానుకోకపోతే పరువు నష్టదావా కేసు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాషను మరువకూడదు

**బెల్లంపల్లి సిఓఈ ప్రిన్సిపాల్**
**గురుకులంలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం**
**అలరించిన బహుభాషా కవిసమ్మేళనం**



**బెల్లంపల్లి,ఫిబ్రవరి 21( ప్రభాత సమాచారం)**
పుట్టుకతో తల్లినుండి నేర్చుకునే భాషనే ఆ వ్యక్తికి మాతృభాషగా ఉంటుందని దానిని ఎప్పటికీ మరువకూడదని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ(సిఓఈ)బెల్లంపల్లి ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు.పాఠశాల లాంగ్వేజ్ క్లబ్ ఆద్వర్య ంలో బుదవారం అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవాన్ని ఘంగ్మా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐనాల సైదులు మాట్లాడు తూ ప్రతి ఒక్కరికీ మాతభాషపై పట్టు సాధించాలన్నారు. భాషలోని సాహిత్యం,గొప్ప కవులు,రచయితలు,కళాకారులు వారి రచనలు తెలుసుకోవాలన్నారు.అదేవిదంగా భాషా సంస్కృతి,సంప్రదాయాలను పెద్దవారినుండి వారసత్వంగా పొందాలని అందుకు వృద్దులను అడిగి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం బహుభాషా కవిసమ్మేళనం మరియు పద్యపఠనం నిర్వహించారు.

**ఆకట్టుకున్న బహుభాషా కవిసమ్మేళనం**
గోండి,లంబాడి,ఉర్దు,హింది,మరాఠి,తెలుగు భాషల్లో విద్యార్థులు తాము వ్రాసిన కవితలను గానంచేసి ఆకట్టుకున్నారు. అదేవిధంగా తెలుగులో పలువురు విద్యార్థులు పద్యపఠనంచేసి తెలుగు భాషపై తమ ప్రేమను చాటుకున్నారు. విద్యార్థులు చురుకుగా పోటీపడి పద్యాలు,కవితలు చెప్పడం పట్ల ప్రిన్సిపాల్ ఆనందం వ్యక్తంచేసూ వారికి చిరుకానుకలు అందజేశారు. వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు.
ఈ కార్యక్రమంలో గోండి భాషలో పెందూరి ఉమేష్(8వ తరగతి),లంబాడీ భాషలో రాథోడ్ జగదీష్(6వ తరగతి), ఉర్దు భాషలో, మహ్మద్ షహజాద్(6వతరగతి),హిందీ లో రాజులదేవి ఆదిత్య(7వ తరగతి), మరాఠి భాషలో జి.అరవింద్ (6వ తరగతి) తెలుగు భాషలో చుంచు సంజయ్,ఐనాల భగవత్(7వ తరగతి),కొండ పల్లి కార్తీక్,కుర్సింగ ఆంజనేయ ప్రసాద్,కర్రె సనత్ కుమార్( 6వ తరగతి),ఇస్లావత్ రిరుపతి(8వ తరగతి),రాంటెకి శివప్రసాద్,జాంబోజి యశ్వంత్(9వ తరగతి)తదితర విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
కార్యక్రమంలో లాంగ్వేజ్ క్లబ్ అద్యక్షులు సజ్జనపు విజయ్ కుమార్,జెవిపి పొన్నం శ్రీనివాస్,కామెర ప్రేమలత,యాస్మని హారిక,కాసర్ల రాజేందర్,గోమాస చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సదర్మాట్ కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం..!!

**త్వరలో ఖానాపూర్ లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తాం**
**గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**





**ఖానాపూర్ ఫిబ్రవరి 21(ప్రభాత సమాచారం)**
గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. బుధవారం ఖానాపూర్ మండలంలోని జిల్లేడుకుంట గ్రామంలో పర్యటించారు. ముందుగా గ్రామస్తులు డోలు వాయిద్యాల మధ్య ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికి,శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. త్రీఫేజ్ కరెంట్,నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సదర్మట్,డి27,డి28 కెనాల్ లా ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామన్నారు. త్వరలో ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించి ఆ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని, సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం,వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు.త్వరలో ఖానాపూర్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. తనపై నమ్మకం నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## తాండూర్ లో డిపిఓ ఆకస్మిక పర్యటన





**తాండూర్, ఫిబ్రవరి21(ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు బుధవారం తాండూర్ లో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా తాండూర్ గ్రామ పంచాయతీ లో రికార్డ్ ఇన్స్పెక్షన్ చేసిన అనంతరం తాండూర్ నర్సరీ, డంపింగ్ యార్డ్, %ZP% హైస్కూల్ లలో పర్యటించారు. నర్సరీ లో మొక్కలు షిఫ్టింగ్ గ్రేడింగ్ చేయాలని అధికారులకు సూచించారు. డంపింగ్ యార్డ్ లో సెగ్రిగేషన్ విషయంలో శ్రద్ధ వహించాలని అన్నారు. కిరాణా షాప్ వద్ద ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించారు. షాప్ ముందు ప్లాస్టిక్ వస్తువులు కనబడితే జరిమానా విధించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీడీఓ పి శ్రీనివాస్, ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తపాస్ కుమార్ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి మరొకరికి తీవ్రగాయాలు



**గంభీరావుపేట (ఎల్లారెడ్డిపేట )ఫిబ్రవరీ 21(ప్రభాత సమాచారం):**
ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ శివారు కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం వీర్నపల్లి మండలం బావ్ సింగ్ తండాకు చెందిన భూక్య సతీష్ 24, భూక్య సాయిరాం ఇద్దరు కలిసి బైక్ మీద వస్తున్న క్రమంలో ముందుగా వెళ్తున్న కారును ఓల్టెక్ చేస్తున్న క్రమంలో అటుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ కు ఢీకొని ట్రాక్టర్ కిందికి దూసుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిసింది. సాయిరాం కు తీవ్ర గాయాలయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గంభీరావుపేట డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



**గంభీరావుపేట ఫిబ్రవరీ 21(ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల గంభీరావుపేటలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచంలోని విభిన్న జాతుల, సంస్కృతులు మాతృభాష ద్వారానే పరిరక్షించబడతాయని, మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ పిట్ల దాసు మాట్లాడుతూ ప్రతి ఏటా ఫిబ్రవరి 21వ తేదీని అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా జరుపుకోవాలని యునెస్కో ప్రకటించడం జరిగింది. బంగ్లాదేశ్ లో బెంగాలీ భాష పరిరక్షణ కోసం చేసిన ఉద్యమానికి ప్రతీకగా 2000 సంవత్సరం నుండి ఫిబ్రవరి 21 ని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం గా జరుపుకుంటున్నాం.మన మాతృభాష అయిన తెలుగును పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు సిహెచ్ ఉమారాణి , సీనియర్ అధ్యాపకులు బి శ్రీవల్లి, డా”వై ఆంజనేయులు, పాక ధర్మపురి, శ్రవణ్ కుమార్, మనోహర్, కృష్ణ ప్రసాద్, రాజేష్ మరియు అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.




హైదరాబాద్: దుబాయ్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఐదుగురు తెలంగాణ వాసులకు విముక్తి లభించింది. ఓ హత్యకేసులో 18ఏళ్లుగా వీరు జైలు శిక్ష అనుభవిస్తున్నారు. నేపాల్‌కు చెందిన వాచ్‌మెన్ బహదూర్ సింగ్ హత్య కేసులో వీరికి తొలుత పదేళ్ల శిక్ష పడింది. ఆ తర్వాత దుబాయ్ కోర్టు శిక్షను 25 ఏళ్లకు పెంచింది. మాజీ మంత్రి కేటీఆర్ నేపాల్ వెళ్లి .. హతుని కుటుంబ సభ్యులకు రూ.15 లక్షలు పరిహారం స్వయంగా చెల్లించి క్షమాభిక్ష పత్రం రాయించినా.. మారిన నిబంధనలతో కోర్టు అంగీకరించలేదు. అనారోగ్య కారణాలు చూపుతూ నిందితుల తరపు న్యాయవాదులు మరోసారి ప్రయత్నించారు. దీనికి అంగీకరించిన దుబాయి కోర్టు ఏడేళ్లు ముందే వారిని విడుదల చేసింది.

దీంతో దుబాయ్ నుంచి సిరిసిల్ల ,రుద్రంగి, కొనరావుపేట మండలానికి చెందిన ఐదుగురు హైదరాబాద్ వచ్చారు. 18ఏళ్ల తర్వాత కుటుంబ సభ్యులను కలుసుకోవడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భావోద్వేగ వాతావరణం నెలకొంది.




**దక్షిణభారత కుంభమేళాగా ఖ్యాతిగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర ఈ రోజు నుంచి ప్రారంభమైంది. ఆదివాసీల ఆరాధ్యదైవాలైన వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించేందుకు భక్తకోటి తండోపతండాలుగా తరలివస్తోంది. ఈ జాతర నాలుగు రోజుల పాటు జరగనుంది.**

## కిషన్ రెడ్డి.. నీకు దమ్ముంటే కాంగ్రెస్‌ను టచ్ చేసి చూడు..



కరీంనగర్ : తెలంగాణ బీజేపీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. “కిషన్ రెడ్డి.. నీకు దమ్ముంటే కాంగ్రెస్‌ను టచ్ చేసి చూడు” అంటూ సవాల్ విసిరారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీని వ్యతిరేకించిన అందరినీ జైలుకు పంపారని.. మరి కేసీఆర్ కుటుంబంపై చర్యలేవి అని ప్రశ్నించారు. బీజేపీ – బీఆర్ఎస్ దోస్తీ ప్రజలకు తెలుసన్నారు. కిషన్ రెడ్డికి పదవి ఇప్పించింది కేసీఆరే అని అన్నారు. కిషన్ రెడ్డిని.. నామినేటెడ్ బై కేసీఆర్ అంటున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. మిగతా రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చినట్టు తెలంగాణలో కుదరదన్నారు. బీజేపీ – బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నది తమకు తెలుసన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఏదో చేయబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అనుమానం వ్యక్తం చేశారు.




## మేడారం జాతరపై ప్రధాని మోదీ తెలుగు ట్వీట్

హైదరాబాద్: మేడారం జాతర ప్రారంభమైన సందర్భంగా తెలంగాణ ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్)లో బుధవారం ఆయన ఒక పోస్ట్ చేశారు. ‘గిరిజనుల అతిపెద్ద పండుగలలో ఒకటి..మేడారం జాతర. భక్తి, సంప్రదాయం, సమాజ స్ఫూర్తిల గొప్ప కలయిక ఈ జాతర. సమ్మక్క–సారక్కలకు ప్రణమిల్లుదాం. వారు ప్రదర్శించిన గొప్ప ఐక్యతా స్ఫూర్తిని, పరాక్రమాన్ని గుర్తుచేసుకుందాం’అని ట్వీట్‌లో ప్రధాని పేర్కొన్నారు. తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం మహా జాతర బుధవారం(ఫిబ్రవరి 21) నుంచి ప్రారంభం కానుంది. సమ్మక్క, సారలమ్మలు వనం వీడి జనారణ్యంలోకి వచ్చి గద్దెలపై కొలువుదీరనున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మేడారంలో మహా జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. మొక్కులు, దర్శనం కోసం భారీగా తరలి వచ్చే వారితో మేడారం పరిసరాలు పూర్తి జనసంద్రంగా మారనున్నాయి. 24 వరకు ఈ జాతర జరగనుంది.




## ఓ వైపు రైళ్లు.. మరో వైపు బస్సులు.. మండుటెండలో ప్రయాణికుల అగచాట్లు..

మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ఎఫెక్ట్ రైల్వే, బస్సుల్లో ప్రయాణించే రెగ్యులర్ ప్యాసింజర్స్ పై కనిపిస్తోంది. మహాజాతరకు నగరం నుంచి సిటీ బస్సులను తరలించడంతో సిటీ ట్రావెలర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కోసం బస్టాపుల్లో పడిగాపులు కాస్తున్నారు. తాము వెళ్లాల్సిన బస్సు ఎప్పుడొస్తుందో.. అసలు వస్తుందో రాదో తెలియక అవస్థలకు గురవుతున్నారు. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వే చేసిన ప్రకటన మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితిపై స్పందించిన సజ్జనార్.. ప్రయాణికులు సహకరించాలని, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని చెప్పడం కొసమెరుపు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే కీలక అలర్ట్ చేసింది. వివిధ ప్రాంతాల మధ్య నడిచే కొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. బుధవారం నుంచి నాలుగు రోజులపాటు సాంకేతిక కారణాలతో రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. గద్వాల–రాయచూరు, సికింద్రాబాద్–సిద్దిపేట, కాచిగూడ–కర్నూలు, కాచిగూడ–రాయచూర్, కాచిగూడ–మహబూబ్‌నగర్, మెదక్–కాచిగూడ, కాచిగూడ–కరీంనగర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 4 వేలకు పైగా బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది.

ఇప్పటికే ఆయా ప్రాంతాల నుంచి బస్సులు బయల్దేరాయి. ప్రయాణికులను జాతరకు తీసుకెళ్తున్నాయి. దీంతో బస్ స్టేషన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. అటు రైళ్లు, ఇటు బస్సుల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నగరంలో ఈ సమస్య మరింత దారుణంగా ఉంది.

## ప్రతి గ్రామానికి విద్య, వైద్య సౌకర్యాలు కల్పించే బాధ్యత నాది



ఖమ్మం: అరాచకం, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపించారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తి ఆత్మీయ సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ... ప్రలోభాలకు గురి చేసినా.. బెదిరించినా తన గెలుపునకు కృషి చేసిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. గతంలో ప్రతిపక్ష పార్టీలు, అధికార పార్టీ నేతలు కలిసి ప్రజాస్వామ్యంగా పనిచేసే వారని తుమ్మల తెలిపారు.

రహదారులు, విద్య, వైద్యం ప్రతి గ్రామానికి సౌకర్యం కల్పించే బాధ్యత తనదన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి పదవుల్లో ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. నాయకుడు ప్రజల్లో నుంచి రావాలని తుమ్మల అన్నారు. మార్కెట్ కమిటీలు... ఆలయ కమిటీల నియామకంలో పార్టీ నిర్ణయం ప్రకారం నడుచుకోవాలన్నారు. పోలీస్, రెవెన్యూ సమస్యలపై గ్రామ.. మండల కమిటీలు భాధ్యతగా వ్యవహరించాలన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు ఒత్తిళ్లతో తప్పులు చేశారన్నారని... అలాంటివి పునరావృతం అవొద్దన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఆరు గ్యారంటీ పథకాల అమలుతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని తుమ్మల అన్నారు.

## మరోసారి మోదీ ప్రధాని కాకుండా ఎవరూ ఆపలేరు: కిషన్‌రెడ్డి



మక్తల్: ప్రజల దృష్టిని మళ్లించేందుకే భారాస, కాంగ్రెస్ ఆరోపణలు, ప్రత్యారోపణలు చేస్తున్నాయని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికలకు ముందు భారాస ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఛార్జిషీట్ ప్రకటించిందని.. వాటి ఆధారంగా కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. మక్తల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “కాంగ్రెస్, భారాస.. రెండూ కుటుంబ పార్టీలే. ఈ ఎన్నికల్లో పోటీకి భారాసకు ఎలాంటి అజెండా లేదు. ఆ పార్టీకి ఒక్క సీటూ రాకపోయినా జనానికి వచ్చే నష్టం లేదు. కాంగ్రెస్ పార్టీకి ప్రధాని అభ్యర్థి ఎవరో తెలియదు. ఆ పార్టీ అధికారంలో ఉన్న హిమాచల్‌ప్రదేశ్‌లోని అన్ని ఎంపీ సీట్లు, కర్ణాటకలో 25 సీట్లు భాజపా గెలవబోతోంది. తెలంగాణలో కాంగ్రెస్ 3–4 సీట్లు గెలిచినా రాష్ట్రానికి ప్రయోజనం ఉండదు. మోదీ మరోసారి ప్రధాని కాకుండా ఎవరూ ఆపలేరు. తెలంగాణలో భాజపా అత్యధిక సీట్లు గెలవకుండా ఏ శక్తీ అడ్డుకోలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైంది. ఆ పార్టీ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. సోనియా కుటుంబానికి సేవ తప్ప.. హామీల అమలుపై వారికి దృష్టి లేదు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఎప్పుడు అమలులోకి తీసుకొస్తారో కాంగ్రెస్ నేతలు చెప్పాలి. ఎన్ని లక్షల కోట్లు అవసరమో.. ఎలా సమకూర్చుకుంటారో ప్రజలకు వివరించాలి. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు రావు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఎప్పటి నుంచి ఇస్తారు?” అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.




## ‘మా పార్కును కాపాడండి ప్లీజ్’

హైదరాబాద్ : నిత్యం తాము ఆడుకునే పార్కు కబ్జాకు గురవుతుందంటూ కొందరు చిన్నారులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ వాళ్లు లేఖ రాశారు. దీంతో లేఖను సుమోటోగా తీసుకుని.. ప్రజాప్రయోజన వ్యాజ్యంగా విచారణ చేప ట్టింది హైకోర్టు. ఆదిలాబాద్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న పార్క్ స్థలంలో కొంత భాగాన్ని కబ్జా చేసే యత్నం చేస్తున్నారంటూ 23 మంది చిన్నారులు హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశారు. రోజూ తాము ఆడుకునే పార్క్‌ను ఎలాగైనా కాపాడాలంటూ లేఖలో సీజేను కోరారు. దీంతో.. కబ్జాపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో పూర్తి వివ రాలు తెలపాలని సీఎస్, జిల్లా కలెక్టర్, పురపాలక సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ పిల్‌పై తదుపరి విచారణ మార్చి 7కు వాయిదా వేసింది.

## అదనపు చార్జీలు వసూలు చేయట్లే.. మేడారంకు బస్సులపై ఆర్టీసీ ఎండీ



హైదరాబాద్, ఫిబ్రవరి 21: తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమక్క – సారక్క జాతర ఈరోజు (బుధవారం) నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. మేడారం జాతరకు టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఈ విషయంపై టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. మేడారం జాతరకు ఆర్టీసీ 6000 ప్రత్యేక బస్సులు నడుపుతోందన్నారు. మేడారం జాతరలో 51 బేస్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చేటువంటి అవకాశం ఉందన్నారు. ఇందు కోసం ఈ జిల్లాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చేటువంటి అవకాశం ఉన్న నేపథ్యంలో హనుమకొండ జిల్లా కాజీపేట నుంచి కూడా బస్సులను ఆపరేట్ చేస్తున్నట్లు చెప్పారు. మేడారం జాతరకు మహాలక్ష్మి స్కీమ్ అమల్లో ఉంటుందన్నారు. ఈనెల 18 నుంచి 25 వరకు ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించామని... ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయట్లేదని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పష్టం చేశారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660